# సౌదామిని

తెల్లవారింది...

రోజులాగే ఆరోజు కూడా చాలా మామూలుగా, సాధారణంగా తెల్లవారింది.

సూర్యుడు రోజులాగే తూర్పున ఉదయించాడు.

గాలి మామూలుగా వీస్తోంది...

పూలు, విచ్చుకున్నాయి -- చెట్లు కదుల్తున్నాయి...

పక్షులు రెక్కలు రెపరెపలాడించి రోజులాగే ఆహారం కోసం విహారానికి బయలుదేరాయి.

పాల కుర్రాడు పాల పాకెట్ వేశాడు...

పేపర్ అబ్బాయి పేపర్ వేశాడు...

నేను రోజు లాగే లేచి నా కాలకృత్యాలు తీర్చుకుని తొమ్మిదిన్నర కల్లా ఆఫీసుకి బయల్దేరాను.

రోజులాగే అటెండెన్స్ రిజిష్టరులో పది గంటలకంతా సంతకం చేసి సీట్లో కూర్చుని పేపర్ చూశాను.

పేపర్ న్యూస్ కూడా రొటీన్...

మరి అంతా మామూలుగానే ఉన్నా, ఇవ్వాళ్టి ప్రత్యేకత ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు...

అందరూ ఎవరి దారిన వారు ఆలోచిస్తుండగా కొత్త షిఫాన్ చీరలో - కళ్ళల్లో కోటి కాంతులు, మొహంలో కొత్త మెరుపులు వెల్లి విరుస్తూండగా తనదైన ప్రత్యేకమైన చిరునవ్వుతో ప్రవేశించింది సౌదామిని.

పది సంవత్సరాల సర్వీసులో మొదటిసారిగా పది రోజులు లాంగ్ లీవ్ పెట్టిన సౌదామిని ఆరోజే మళ్ళీ ఆఫీసుకొచ్చింది. ఒక్కసారిగా అందరిలోనూ

చిన్న 'జర్క్' లాంటిది కలిగింది.

సౌదామిని అందర్నీ ఓసారి చూసి నెమ్మదిగా సెక్షన్ హెడ్ దగ్గరికి వెళ్ళి తన బ్యాగ్‌లోంచి నాలుగు వైపులా పసుపు అంటించిన తెల్లటి కవర్ తీసి అందించింది.

ఆయన తెల్లబోయి చూస్తోంటే నునుసిగ్గుతో అన్నది ''నా మ్యారేజి సార్.... తప్పకుండా రావాలి...''

ఒక్కసారిగా అక్కడి వాతావరణం స్తంభించింది...

అందరిలోనూ ఒకే భావన... ఒకే స్పందన...

సౌదామిని పెళ్ళా?... ఎలా?...

ఎవరి భావాలతోనూ పనిలేని సౌదామిని అందరికీ వేరు వేరుగా కార్డులందించింది. తప్పకుండా రమ్మని మరీ మరీ ఆహ్వానించి వయ్యారంగా కదిలి వెళ్ళిపోయింది...

సౌదామిని పెళ్ళి...

కలా!... నిజమా?...

నలభై ఏళ్ళున్న వృద్ధకన్య అంటూ అందరి పరిహాసాలకూ, విమర్శలకూ గురైన సౌదామిని పెళ్ళి...

సౌదామిని చాలా సాధారణమైన స్త్రీ. అనాకారి కాదు... కానీ అందగత్తె అసలే కాదు...

ఆమెకి ఆభరణం ఏ పరిస్థితుల్లోనూ చెదరని ఆమె పెదవులపైన చిరునవ్వు.

సౌదామిని, నేను దాదాపు ఒకేసారి ఆ ఆఫీసులో చేరాం. నేను డిగ్రీ పూర్తి కాగానే క్లర్కుగా నాకా ఆఫీసులో ఉద్యోగం దొరికింది.

అప్పటికి రెండు రోజుల ముందే సౌదామిని టైపిస్టుగా చేరినట్టు చెప్పింది. అప్పటికి ఆమెకి 34 ఏళ్ల వయస్సు... నాకు 22 ఏళ్ళు...

ప్రభుత్వ ఉద్యోగానికి కావాల్సిన నిర్ణీత వయో పరిమితికి చేరువగా వచ్చింది సౌదామిని... ఎనిమిది నెలలు గడిస్తే ఆ వయసు కూడా దాటిపోయేది. అప్పటికే ఆమె అవివాహిత...

ఉద్యోగంలో కొత్తగా ఓ ఆడపిల్ల చేరిందంటే - ఆమె గురించిన వివరాలు సేకరించడం మగవాళ్ళకి హాబీ... అందులోనూ అవివాహిత అయితే పూర్తి అటెన్షన్ వారి మీదే ఉంటుంది.

సౌదామిని వివాహ వయస్సు దాటి పోయిన అవివాహిత. అందుకేనేమో ప్రతి వారి దృష్టి ఆమె మీద - ఆమె వ్యక్తిగత జీవితం మీదా ఉండేది.

అదృష్టవశాత్తు నాకు ఉద్యోగంలో చేరిన ఆర్నెల్లకే పెళ్లైపోయింది. అందుకే నేను మా ఆఫీసులోని అనాగరిక జంతువుల బారినుండి తప్పించుకో గలిగాను.

కానీ, ఈ సమాజంలో వంటరి ఆడదన్నా, వయసు మీరి అవివాహితగా ఉండిపోయిన ఆడదన్నా ఓ చులకన భావం ఉంది. ప్రతి వాళ్ళూ ఆ ఆడదాని మీద తమకే సర్వహక్కులున్నట్టు తామే ఆమెని ఉద్ధరించేస్తున్నట్టు ప్రవర్తిస్తుంటారు. నిజానికి 34 ఏళ్ళొచ్చినా, నలభై ఏళ్ళొచ్చినా పెళ్లికాకపోవడం ఆ ఆడదాని నేరం కాదు కదా!...

అందుకు సవాలక్ష కారణాలు ఉండచ్చు...

ఆ కారణం ఏదై ఉంటుంది?... ఏదై ఉంటుంది? అని గుండెలు బాదుకోడం అందరికీ మామూలు అయిపోయింది. ఎందుకంటే వాళ్ళందరికీ వారి వారి వ్యక్తిగత జీవితం మీదకన్నా ఇతరుల వ్యక్తిగత జీవితం మీద శ్రద్ధ ఎక్కువ...

సౌదామినికి ఇంతకాలం పెళ్ళి కాకపోవడం చుట్టు ప్రక్కల వారిలో రక రకాల ఆలోచనలు... అనుమానాలు కలగ చేసింది... ముఖ్యంగా మగవాళ్ళు...

''అయ్యో పాపం! ఇంకా పెళ్ళి కాలేదా?... నన్ను చేసుకుంటుందేమో అడుగు గురూ!... రెండో పెళ్ళాంగా ఉంచుకుంటా!'' అని పరోక్షంగా వెకిలిగా మాట్లాడటం, వెకిలి చూపులు... అసహ్యకరమైన విమర్శలూ, ఇవన్నీ మన పురుషపుంగవులకు ''వెన్నతో పెట్టిన విద్యలు...'' అంతేకాదు... ఆమె వ్యక్తిగత జీవితానికి రకరకాల రంగులు పూసి అసలు నిజాన్ని వికారంగా మార్చిన ఘనులు... కూడా మగవారే...

అయితే వీరిలో కొందరు ఆడవారు కూడా మగవాళ్ళ మాటలు విని అవును కాబోలు అంటూ తమ అజ్ఞానాన్ని, అన్ని విషయాల్లోనూ పరాధీన భావాన్ని బహిర్గతం చేస్తుండటం - ఇవన్నీ మామూలు అయిపోయింది.

''సౌదామినికి ఇంతకు ముందే పెళ్లైందట... మొగుడు వదిలేశాట్ట... అలా చెబితే బాగోదని మంగళసూత్రం తీసి పారేసి పెళ్ళి కాని పిల్లలా తిరుగుతోంది...''

''అవునట... మా ఫ్రెండ్ వాళ్ళ తమ్ముడు, సౌదామిని తమ్ముడు క్లాస్ మేట్స్‌లట... వాడు చెప్పాడు. ఒక కొడుకు కూడా ఉన్నాట్ట. ఆ పిల్లవాడ్నేదో హాస్టల్లో చేర్పించిందట...''

''నీ మొహం... అదేం కాదు... వాళ్ళు దేవదాసీలుట... సౌదామిని తల్లీ, అమ్మమ్మా వృత్తి చేసే వాళ్ళట... ఇప్పుడు దేవదాసీలు లేరు కాబట్టి... సౌదామిని ఏ ప్రభువుకోదాసి అయిందట.... వాళ్ళకి పెళ్ళిళ్ళు ఎలా అవుతాయి...''

''ఏమో!... ఏదైతే ఏంలే... కొద్దిగా ట్రై చేస్తే నలలో పడచ్చు...''

''ఆల్ ది బెస్ట్...''

ఇలాంటి అసహ్యకరమైన సంభాషణలు అప్పుడప్పుడూ నాచెవిన పడుతుంటే సౌదామిని మీద జాలితో, నా హృదయం నిండి పోయేది.

''నీకు తెలుసా సుజా! సౌదామిని వాళ్ళు బోగం వాళ్ళుట...'' ఏనాడూ తన బ్రెయిన్‌తో ఆలోచించటానికి ప్రయత్నించని బద్ధకస్తురాలు ఉమ అన్నది.

ఓ రోజు...

''అని ఎవరన్నారు ఉమా! వెంకట్రావా? కుటుంబరావా సీరియస్‌గా అడిగాను.

''మన కుముదిని వాళ్ళ బావగారు చెప్పార్ట...''

కుముదిని మా సెక్షన్‌లో అందరికన్నా వయసులో పెద్దది. ఆమెకి ఏ పనీ రాదు... వచ్చిన పని చేయటానికి ఆవిడ శరీరం సహకరించదు. భారీ శరీరం ఆవిడది. దానికి తోడు అనారోగ్యం... ఏ పనీ లేకుండా పని చేస్తున్న వాళ్ళని కూడా తన అనవసరమైన వాగుడుతో డిస్టర్బ్ చేస్తూ ఉంటుంది. ఆవిడ స్థూలకాయం (పైగా అనారోగ్యం) కారణంగా భర్త వదిలేశాడు. చూసే వాళ్ళందరి దృష్టిని ఆకర్షించడం కోసం ఆవిడ రోజూ మొహానికింత పసుపు రాసుకుని, నుదుట అర్ధ రూపాయంత కుంకుమతో అందరికీ పవిత్ర భావాన్ని కలుగజేసే ప్రయత్నం చేస్తుంటుంది.

పవిత్రత రూపంలో కాదు... మనస్సులో ఉండాలన్న కనీస జ్ఞానం ఆవిడకుండి ఉంటే తోటి స్త్రీ పట్ల ఇలాంటి అసభ్యకరమైన ఆరోపణ చేసి ఉండేదికాదనిపించింది నాకు...

పాపం సౌదామిని!...

తన పట్ల జనాలు చేసే ఈ విమర్శలు... అల్లుతున్న రకరకాల కథలు ఆమెకి తెలుసో! లేదో!

కానీ, ఆమె ఎప్పుడూ చిరునవ్వుతో కనిపిస్తుంది. టైమ్ ప్రకారం రావడం, టైమ్ ప్రకారం వెళ్ళడం అందరితో చిరునవ్వుతో మాట్లాడటం... ఒక్క పైసా కూడా అనవసరంగా ఖర్చు చేయకపోవడం - ఆమె ప్రత్యేకతలు.

ఆమె మొహంలో తనకింకా పెళ్ళి కాలేదన్న దిగులు... అవుతుందో! లేదోనన్న సందేహం తాలూకు బాధ నేనెప్పుడూ గమనించలేదు... ఎంతసేపు మాట్లాడినా సినిమాలు, రాజకీయాలు, విద్య ఇలాంటి విషయాలు తప్ప ఏనాడూ తన వ్యక్తిగత విషయాలు ఇతరులకి చెప్పడం ఇతరుల వ్యక్తిగత విషయాలు ఆమె అడగటం లాంటివి చేయదు...

ఎప్పుడన్నా ''నిన్నందరూ ఇలా అంటున్నారు సౌదామినీ! అసలు నీ సమస్య ఏమిటి'' అని అడగాలనిపించినా నాకు ధైర్యం సరిపోలేదు...

సౌదామిని జీవితం ఓ పజిల్...

ఆ పజిల్ విప్పాలని ఎందరు ప్రయత్నించినా ఓటమి ఎదురవడమే...

మూసి ఉంచిన గుప్పిట లాంటి ఆమె జీవితంలో ఉన్న ఆ రహస్యం ఛేదించాలని ఎందరు, ఎన్ని విధాల ప్రయత్నించినా పరాజయమే...

ఈ జయాపజయాలతో పనిలేని సౌదామిని... తను ఎంచుకున్న మార్గంలో గంభీరంగా పయనిస్తూ తను చేరవలసిన గమ్యాన్ని చేరుకుంది...

నాకు చాలా సంతోషం కలిగింది...

సౌదామిని పెళ్ళి... ఎంత బాగుంది! ఇలా ఊహిస్తోంటేనే...

పెళ్ళికి చాలామంది రామన్నారు... '' ఆ! ముసలమ్మకి పెళ్ళేవిటండీ బాబూ! పీటల మీద షష్టిపూర్తి జంటను చూసినట్టు ఉంటుంది మేం రాము...'' అన్నారు.

''వెళ్దాం... ఈ అందాల వృద్ధకన్యను చేసుకునే ఆ మహానుభావుడెవరో చూద్దాం...'' అన్నారు మరికొందరు.

ఎవరేమన్నా ఆ కళ్యాణ ఘడియ రానే వచ్చింది.

నేను పెళ్ళికి వెళ్ళాను.

పట్టు చీరలో, నుదుట కళ్యాణ తిలకంతో, కళ్ళనిండా కోటి కాంతులతో పెళ్ళి పీటల మీద కూర్చునుంది సౌదామిని.

పెళ్ళికొడుకు పెద్దవాడే...

"ఏ రెండో పెళ్ళివాడో అయుంటాడు..." నా వెనకాల ఎవరో అంటున్నారు.

ఆ మాటలు నన్నంత బాధించలేదు...

పెళ్ళి కూతురుగా మారిన సౌదామిని... కళ్యాణ మంటపంలో కూర్చుని వేదమంత్రాల మధ్య మంగళసూత్రం కట్టించుకుంటోన్న ఆ అపూర్వ సన్నివేశం నాకెంతో నయనానందకరంగా, మహత్తరంగా అనిపిస్తోంది.

వృద్ధకన్య పెళ్ళి కదా! అని పురోహితులు మంత్రాలు తప్పు చదవటం లేదు... మల్లెపూలు గుబాళించక మానలేదు... అగరొత్తులు పరిమళం వెదజల్లక ఊరుకోలేదు... సన్నాయి వాయిద్యంలో అపశృతులూ రాలేదు...

అంతా యధావిధిగా జరుగుతోంది...

సౌదామిని తల్లితండ్రులు కన్యాదానం చేయటం, వధూవరులిద్దరూ జీలకర్ర బెల్లం తలమీద పెట్టుకోటం... సూత్రధారణ... తలంబ్రాలు వగైరా తతంగం అంతా జరుగుతోంది...

కుక్కల మొరుగుళ్ళకీ, తోడేళ్ళ అరుపులకీ, కీచకుల ఆకలి చూపులకీ, తోటి స్త్రీల జాలి చూపులకీ, వెటకారాలకీ, విమర్శలకీ... అన్నిటికీ అతీతంగా సౌదామిని...

అనేక రకాల అనుభవాలనూ, మానసిక క్షోభనూ, అవమానాలనూ చిరునవ్వుతో భరించిన సౌదామిని పెళ్ళి కూతురైంది...

నలభై ఏళ్ల వయసు దాకా ఆమెకి పెళ్ళి కాకపోవటానికి కారణం... వరకట్నం కావచ్చు... పెళ్ళి కొడుకులకున్న గొప్ప గొప్ప ఆశలు కావచ్చు... ఆమె తండ్రి నిస్సహాయత కావచ్చు... అన్నల స్వార్థం కావచ్చు... ఈ సమాజం కావచ్చు...

...జీవితమంటే పెళ్ళి ఒక్కటే కాదు...

పెళ్ళి అనేది... ఓ మలుపు... అది గమ్యం ఎన్నటికీ కాదు...

అయితే నాకెందుకో ఇప్పుడనిపిస్తోంది పెళ్ళి అందరి జీవితానికి ఓ మజిలీ అయితే సౌదామిని జీవితానికి అదే గమ్యం కాబోలు. అందుకే ఆలస్యంగా తనా గమ్యాన్ని చేరిందేమో అని...

ఏది ఏమైనా... సౌదామిని ఓ ఇంటికి ఇల్లాలైంది...

నేను దగ్గరగా వెళ్ళి... నా చేతిలోని గిఫ్ట్ ప్యాకెట్ సౌదామిని చేతికి అందించి... ''విష్ యూ ఎ హాపీ మ్యారీడ్ లైఫ్'' అన్నాను.

సంతృప్తి నిండిన కళ్ళతో నావైపు చూస్తూ ''థాంక్యూ'' అన్నది.

నేను మిగతా వారికి దారిచ్చి వెనక్కి వెళ్ళి దూరం నుంచి ఓసారి కళ్యాణ మంటపం వైపు చూశాను.

కొబ్బరి మట్టలతో అపురూపంగా మలచిన ఓ కళాఖండం అది.....

ఆడపిల్ల జీవితానికి నిండుదనాన్ని ఆపాదించి నూరేళ్ళ ఆమె జీవితాన్ని శాసించి, భవిష్యత్తుని నిర్ణయించే ఓ వేదిక.

ప్రతి ఆడపిల్లా జీవితంలో ఓసారన్నా అందులో ఆశీనురాలై, ఆ వేదిక నిర్ణయించే భవిష్యత్తు కోసం ఎన్నో కలలు కంటుంది. ఆ కలలు కొందరికి మధుర స్వప్నాలైతే, మరి కొందరికి దుస్వప్నాలవుతాయి. మరికొందరు ఆ వేదిక నలంకరించే అదృష్టానికి నోచుకోరు.

అలాంటి వాళ్ళను సమాజం చిన్న చూపు చూడటం, అవమానించడం నాగరికతకి పరాకాష్ఠ?

మనిషి అంతరిక్షంలో జీవించడానికి సన్నాహాలు చేస్తోన్న ఈ యుగంలో కూడా ఆడపిల్ల ఎన్ని వేదికలెక్కి, ఎంత ప్రగతిసాధించినా కళ్యాణ మంటపం అనే వేదికనెక్కనందుకు కాకుల్లా పొడిచి పొడిచి ఆమె మరణానికి పరోక్షంగా కారకుడవుతున్నాడీ నాగరిక మానవుడు.

అలాంటి అవమానాలనూ, వేదననూ చిరునవ్వుతో భరించి చివరికి విజయాన్ని సాధించిన సౌదామిని తనలాంటి ఎందరో ఆడపిల్లలకు స్ఫూర్తిగా... ఆమె జీవితం అందరికీ ఓ ఆదర్శంగా...

శభాష్ సౌదామినీ!...

ఆకాశవాణిలో ప్రసారం